సాక్షి గుంటూరు

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరులోని పలు పార్సిల్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. రూ.13.68 లక్షల ఆర్గానిక్ ఎరువులను జప్తు చేశారు.



2.15 లక్షల క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2,14,788 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 2,17,795 క్యూసెక్కులు పులిచింతల ప్రాజెక్టులో వచ్చి చేరుతోంది.



41,540 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 38,828 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 41,540 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

అపార నష్టం అందేనా సాయం!

భారీ వర్షాలకు తోడు కృష్ణమ్మ వరదలు ముంచెత్తడంతో జిల్లావ్యాప్తంగా అపార నష్టం వాటిల్లింది. ఇళ్లలోకి నీరు చేరి సామాన్యులు సర్వం కోల్పోయారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట నీట మునగడంతో అన్నదాతలు కుదేలయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం నష్టం అంచనాలు సిద్ధం చేసింది. క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్న కేంద్ర బృందం పలు చోట్ల జరిగిన నష్టాన్ని పరిశీలించనుంది. అన్నివిధాలా తమను ఆదుకోవాలని ముంపు బాధితులు వేడుకుంటున్నారు.

- తుది అంచనాలు సిద్ధం చేసిన యంత్రాంగం
- నేడు జిల్లాకు రానున్న కేంద్ర బృందం
- రేపు పెదకాకాని ప్రాంతంలో పర్యటన

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు జిల్లాలో అపార నష్టం వాటిల్లింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం వానలు, వరదతో జరిగిన నష్టంపై తుది అంచనాలను సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో పంట నష్టం పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం రాత్రి గుంటూరుకు చేరుకోనుంది. గురువారం ఉదయం పెదకాకాని పరిసర ప్రాంతాలలో పంట నష్టం జరిగిన ప్రాంతాలలో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి నష్టానికి సంబంధించిన నివేదికను విడుదల చేశారు. అందులోని వివరాల మేరకు... జిల్లావ్యాప్తంగా వరదలకు ఏడుగురు మృత్యువాత పడ్డారు. వారి కుటుంబాలకు రూ. 35 లక్షల పరిహారం చెల్లించారు. జిల్లాలోని 11 మండలాల పరిధిలో ఉన్న 25 గ్రామాలు, నాలుగు పట్టణాలలో కలిపి 75,153 మంది వరదల వల్ల ఇబ్బంది పడ్డారు. 84 మంది ఎన్డీఆర్ఎఫ్/ఎస్డీఆర్ఎఫ్ బృంద సభ్యులను, 42 బోట్లు, రెండు లాంచీలను రంగంలోకి దించి 3,091 మందిని కాపాడారు. 43 పునరావాస కేంద్రాలలో 7,365 మందికి వసతి కల్పించారు. ప్రస్తుతం అన్ని కేంద్రాలను మూసి వేశారు. 71,870 ఆహార పొట్లాలు, 66,516 తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం 11,937 మందికి రూ.5.96 కోట్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 43 హెల్త్ క్యాంపులు నిర్వహించారు.

- జిల్లాలో 21 పక్కా, 13 కచ్చా ఇళ్లు పూర్తిగా.. 77 పక్కా, 453 కచ్చా నివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 287 పూరి గుడిసెలు దెబ్బతినగా, మరో 13,801 నీట మునిగాయి.
- 36,804 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 33,210 హెక్టార్లలో వరి, 3,594 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.
- 44 పశువులు మృత్యువాత పడగా, 186 గల్లంతు అయ్యాయి. 12 గొర్రెలు, 252 కోళ్లు చనిపోయాయి. రూ.86.25 లక్షల నష్టం వచ్చినట్లు అంచనా వేశారు. పశువుల మేత కోసం రూ.43.83 లక్షలు మంజూరు చేశారు.
- జిల్లాలో 303.55 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులకు రూ.16.09 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.142.70 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. పంచాయతీ రాజ్ విభాగం పరిధిలో 128 రోడ్లు 280 కి.మీ. మేర దెబ్బతిన్నాయి. వీటి శాశ్వత మరమ్మతులకు రూ.72.47 కోట్లు అవసరమని అంచనా వేశారు. మున్సిపాలిటీల పరిధిలో 42.93 కి.మీ. మేర రోడ్లు, 10.2 కి.మీ. పొడవైన డ్రయిన్లు, 2,449 వీధి దీపాలు, ఒక భవనం దెబ్బతిన్నాయి. రూ.29.14 కోట్ల నష్టం వాటిల్లింది.
- మైనర్ ఇరిగేషన్‌కు తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల కోసం రూ.7 లక్షలు అవసరం. గ్రామీణ నీటిపారుదల శాఖకు సంబంధించి మొత్తం రూ.85.90 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. మత్స్యశాఖకు చెందిన 60 వలలు దెబ్బతినగా, రూ.మూడు లక్షల నష్టం వాటిల్లింది.
- చేనేత శాఖకు సంబంధించి 10 మగ్గాలు నీట మునిగాయి. దీంతో రూ.60 వేల నష్టం వచ్చింది. నీట మునిగిన యార్న్, మెటీరియల్, పూర్తి అయిన స్టాక్‌కు సంబంధించి రూ.58.76 లక్షల నష్టం జరిగింది.
- విద్యుత్ శాఖకు సంబంధించి రెండు 33 కేవీ ఫీడర్స్ దెబ్బతిన్నాయి. 11 కేవీ ఫీడర్లు 152, 33/11 సబ్‌స్టేషన్లు 7, 33 కేవీ స్తంభాలు 8, 11 కేవీ స్తంభాలు 136, ఎల్‌టీ పోల్స్ 153తోపాటు ఇతర అంశాలకు సంబంధించి రూ.74.60 లక్షల నష్టం వాటిల్లింది.



పెదకాకాని మండలం తంగెళ్ళమూడిలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు



నంబూరు పెనుమూలి రోడ్డులో పంట పొలాల దుస్థితి ఇదీ..

రుణాలు రీ షెడ్యూల్ చేయండి

డీసీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ముంపు ప్రాంత బాధితులు గతంలో తీసుకున్న రుణాలను రీ షెడ్యూల్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గత నెల 30, 31వ తేదీల్లో 24 గంటల్లోనే దాదాపు 27 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు గుర్తు చేశారు. కృష్ణానదికి భారీగా వరద రావడంతో 10 మండలాలు ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా నదికి సమీపంలోని కొల్లిపర, తుళ్ళూరు మండలాల్లోని లంక గ్రామాలు మునిగి పోయాయన్నారు. జిల్లాలో 33 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఉద్యాన పంటలు సైతం తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. వేల సంఖ్యలో పశువులు చనిపోవడంతోపాటు వరద నీటిలో కొట్టుకుపోయాయని తెలిపారు. అనేక విధాలుగా ప్రజలకు నష్టం వాటిల్లిందన్నారు. చిరు వ్యాపారుల తోపుడు బండ్లు, రిక్షాలు, ఆటోలు, చేనేత మగ్గాలు కొట్టుకుపోయినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల వారు నష్టానికి గురయ్యారని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాల్సిన తరుణమిదని తెలిపారు. బాధితులు పంట కోసం, వివిధ పథకాల ద్వారా తీసుకున్న వాటితోపాటు ఎంఎస్ఎంఈలకు ఇచ్చిన రుణాలను ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం అదనపు వడ్డీ లేకుండా రీ షెడ్యూల్ చేయాలన్నారు. జీవిత బీమా, వాహనాల ఇన్సూరెన్స్ తదితర క్లెయిములను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నష్టపోయిన వారు తిరిగి వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన రుణాలను అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ ఆర్ఎం జవహర్, నాబార్డ్ డీడీఎం శరత్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చవితి వేడుకలు ముగిసే వరకు పటిష్ట చర్యలు



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు ముగిసే వరకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులకు నిమజ్జనం వేళ జాగ్రత్తలను వివరించాలని సూచించారు. మండపాలు, పందిళ్ల వద్ద, ఊరేగింపు సమయంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. ఇతర మతాల వారికి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని గుర్తించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు, డీజేలు పెట్టే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జనానికి అనువైన కాలువలు, కుంటలు, చెరువులను కమిటీలకు సూచించాలని పేర్కొన్నారు.

ఐదేళ్ల నానో టెక్నాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ నానో టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి ఆచార్య వి. రవి కుమార్ తెలిపారు. 3వ విడత వెబ్ ఆప్షన్లు, రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు WWW.OAMDC.AP.GOV.IN వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ/బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, యూనివర్సిటీ నిబంధనల ప్రకారం హాస్టల్, లైబ్రరీ సౌకర్యాలు ఉంటాయని వివరించారు. వివరాలకు 94915 49853, 99661 19781 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈతకు వెళ్లి ఇరువురు దుర్మరణం



సంతోష్



సుధీర్

నరసరావుపేట రూరల్: ఈతకు వెళ్లి నీటమునిగి ఇరువురు దుర్మరణం పాలైన ఘటన రావిపాడు సమీపంలోని చిలకలూరిపేట మేజర్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. రావిపాడు పంచాయతీ పరిధిలోని బాలయ్యనగర్‌కు చెందిన పసుమర్తి సంతోష్(22), చిరుతుల సుధీర్(8) బంధువులు. మంగళవారం సాయంత్రం వీరు ఇరువురు చిలకలూరిపేట మేజర్ కేనాల్‌లో ఈతకు వెళ్లారు. కెనాల్‌లో లోతు ఎక్కువగా ఉండటంతో సుధీర్ మునిగిపోవడంతో అతని రక్షించేందుకు వెళ్లిన సంతోష్ నీటి ప్రవాహవేగానికి కొట్టుకుపోయాడు. దీనిని గమనించిన స్థానికులు ఇరువురిని రక్షించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ కిశోర్ తెలిపారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 21వ తేది వరకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి కొండా సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో స్టార్ట్ యువర్ బిజినెస్ (ఎస్‌వైబీ) ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్టు వివరించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారాలనుకునే యువత తాము ప్రారంభించే వ్యాపార వివరాలతో తమ పేర్లు రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 91602 00652 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం కావాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయ ఘాట్‌రోడ్డులో జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను మంగళవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. ఇటీవల ఇక్కడ కొండ చరియలు విరిగి పడ్డాయి. రిటైనింగ్ వాల్‌ను నిర్మిస్తుండగా మంత్రి పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు.

నేడు వైఎస్ జగన్ రాక



కార్పొరేటర్లతో సమావేశమైన మాజీ మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, తూర్పు ఇన్‌చార్జి నూరి ఫాతిమా

- వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా హాజరు కావాలని నేతల పిలుపు
- ఏర్పాట్లపై మాజీ మంత్రి విడదల రజని తదితరుల సమీక్ష

పట్నంబజార్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం గుంటూరు రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని మాజీ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పిలుపునిచ్చారు. గుంటూరు శ్యామలానగర్‌లోని మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ కేసులో అరెస్టై గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్, టీడీపీ నేతల దాడిలో గాయపడిన క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని పరామర్శించేందుకు వైఎస్ జగన్ గుంటూరు రానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున హాజరై మాజీ సీఎం జగన్‌కు స్వాగతం పలకాలని నాయకులు కోరారు. జిల్లా జైలు, ఎస్వీఎన్ కాలనీ వద్ద ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు విద్యుత్తే కీలకం

- ఉత్పత్తి, తలసరి వినియోగం భారీగా పెరగాలి
- సైన్స్ అండ్ టెక్నాలజీ సాయంతోనే లక్ష్యసాధన
- డాక్టర్ నాయుడమ్మ అవార్డు స్వీకర్త ఎన్ఎల్‌సీఐఎల్ సీఎండీ ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న మోటుపల్లి ప్రసన్నకుమార్. వేదికపై మంత్రి నాదెండ్ల, రఘునాథబాబు తదితరులు

తెనాలి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దేశంలో విద్యుత్ రంగం కీలకమని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, తలసరి వినియోగం భారీగా పెరగాల్సి ఉందని పేర్కొన్నారు. తలసరి వినియోగంలో ప్రపంచ సగటు 3,500 కేడబ్ల్యూహెచ్ (కిలో వాట్/గంటకు) కాగా, భారత్‌లో కేవలం ఈ సంఖ్య 1,350గా ఉందని చెప్పారు. దీనిని 2047 నాటికి 12,500కు తీసుకెళ్లాల్సి ఉందన్నారు. అందుకు విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటైన ప్రత్యేక సభకు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా మోటుపల్లి ప్రసన్నకుమార్‌కు ప్రదానం చేశారు. సభలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ లక్ష్యసాధనకు విద్యుత్ వినియోగాన్ని దాదాపు పది రెట్లు పెంచుకోవాలన్నారు. ఇందులో సగం పునరుత్పాదక శక్తిగా తీసుకోవాల్సి ఉందని తెలిపారు. థర్మల్ పవర్ సామర్థ్యాన్ని కొనసాగిస్తూ, పునరుత్పాదక శక్తిని పెంచుకుంటూ వెళ్లాలని సూచించారు. నిల్వ సామర్థ్యాన్ని పెంచుకుంటూ ఖర్చు తగ్గించుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణంపై అతి తక్కువ ప్రభావం ఉండేలా చూసుకోవాలన్నారు. సవాలుతో కూడిన ఈ లక్ష్యసాధనకు సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర కీలకమని చెప్పారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ నాయుడమ్మ అవార్డును స్వీకరించటం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.

తెనాలికి విజన్ డాక్యుమెంట్

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. తెనాలి సమీపంలోని పల్లెటూరు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన శాస్త్రవేత్త నాయుడమ్మ స్ఫూర్తిని ముందు తరాలకు తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. తెనాలికి 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈ నెలాఖరుకల్లా సిద్ధం చేస్తామని చెప్పారు. కెమికల్ లేదా లెదర్ టెక్నాలజీలో నైపుణ్య అభివృద్ధి సంస్థను తీసుకొస్తానని తెలిపారు. తెనాలి–మంగళగిరి నాలుగు లేన్ల రహదారి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి యంగ్ ఇన్నోవేటర్ అవార్డును కూడా ఇవ్వాల్సిందిగా నిర్వాహకులకు సూచించారు.

నాయుడమ్మ స్ఫూర్తితో సీఎల్ఆర్ఐ

చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణ వి.కాంత్ మాట్లాడుతూ.. నాయుడమ్మ స్ఫూర్తితో తమ సంస్థ సీఎల్ఆర్ఐ నడుస్తోందని చెప్పారు. తోలు ఉత్పత్తుల ఎగుమతిలో ఏటా 40 శాతం పెరుగుదల లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు తెలిపారు. సీఎల్ఆర్ఐలో వచ్చే లిక్విడ్ వ్యర్థాన్ని జీరో చేశామని చెప్పారు. ఘన వ్యర్థాలను తిరిగి వినియోగంలోకి తెస్తున్నామని తెలిపారు. కొత్త డిజైన్లు, సరికొత్త పర్యావరణ విధానాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, టి.అనంతాచార్యులు, అయినాల మల్లేశ్వరరావు, యలవర్తి పవన్‌కుమార్ మాట్లాడారు.

తగ్గిన వాన.. తీరని వేదన

వర్షపు నీటితో కొట్టుకుపోయిన రహదారులు

- బురదమయంగా మారిన పలు మార్గాలు
- అధ్వాన పారిశుద్ధ్య నిర్వహణతో జ్వరాలు
- అధికారులు స్పందించాలని ప్రజల వినతి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థతోపాటు దుగ్గిరాల మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చాలాచోట్ల నివాస ప్రాంతాల్లో మురుగు నీళ్లు నిలిచాయి. కార్పొరేషన్ అధికారులు, దుగ్గిరాల మండలంలోని ఆయా పంచాయతీల అధికారులు విద్యుత్ మోటార్లతో నీటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు. కానీ తెల్లారేసరికి మళ్లీ పైనుంచి వచ్చే నీటితో పరిస్థితి మొదటికొస్తోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నడవాలన్నా కష్టమే..

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం, నవులూరుతోపాటు తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, తెల్లక్వారీ, ఎంఎల్ రామయ్య కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. కొండ ప్రాంతాల్లోని రహదారుల్లో పైనుంచి వచ్చిన ప్రవాహం వల్ల చాలా చోట్ల గ్రావెల్ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాత్రి సమయంలో ప్రజలు నడవాలన్నా కష్టాలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనాలపై ఆ ప్రాంతానికి రాకపోకలు సాగించడం కూడా వీలు కావడం లేదు. లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలవడం, కొన్ని చోట్ల రోడ్లపై బురద పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుమాక నుంచి టిడ్కో నివాసాలకు వెళ్లే రహదారి మొత్తం బురదమయంగా ఉంది. రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎంఎల్ రామయ్య కాలనీలో ఒకే ఇంట్లో ముగ్గురు జ్వరాల బారిన పడ్డారు. పలుచోట్ల ఇదే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. అక్కడక్కడ కుక్కలు, పందులు చనిపోయి దుర్వాసన వస్తోంది. వెంటనే అధికారులు వాటిని తొలగింపజేయాలని ప్రజలు కోరుతున్నారు. బ్లీచింగ్ చల్లించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని విన్నవిస్తున్నారు.



జగ్జీవన్‌రామ్ కాలనీలో క్రీస్తు సంఘం వద్ద బురదమయంగా రహదారి



యర్రబాలెంలో మోటార్లతో వర్షపు నీటిని తోడుతున్న దృశ్యం

తీవ్రంగా దోమల బెడద



మూడు రోజులపాటు ఇంటి ముంగిట్లో నీరు నిల్వ ఉంది. అధికారులు మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపారు. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో ఇంకా నీళ్లు అలాగే ఉన్నాయి. రోడ్లు మొత్తం బురదమయంగా మారాయి. దోమల సమస్య పరిష్కరించాలి.

–షేక్ శిరీషా బేగం, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ

కొట్టుకుపోయిన రోడ్లు



కొండ ప్రాంతంలో ఉన్న గ్రావెల్ రోడ్లు అన్నీ వర్షపు నీటి దెబ్బకు కొట్టుకుపోయాయి. ఎవరికైనా అర్ధరాత్రి సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే సులకపేట రోడ్డు వరకు మోసుకు రావాల్సిందే. కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి రహదారులు తిరిగి నిర్మించాలి.

– పసుపులేటి సన్యాసిరావు, రాజీవ్ కాలనీ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 7,000 గరిష్టం : రూ. 8,500

మోడల్ ధర రూ. 7,800

క్లుప్తంగా

వరద బాధితులకు సాయం



మంగళగిరి: వరద బాధితులకు రూ.9 లక్షల విలువైన ఆహార పదార్థాలు, నిత్యావసర సరకులు, కిట్లు ఇవ్వడానికి మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ముందుకొచ్చింది. మంగళవారం యూనివర్సిటీ నుంచి వాటితో కూడిన వాహనాలను వీసీ మనోజ్ అరోరా ప్రారంభించారు. బాధితులకు ఈ వస్తువులను పంపిణీ చేయడానికి వాహనాల్లో తరలించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు అనూప్ సింగ్, చంద్రప్రభు, వేణుగోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ భూమి వినియోగానికి అనుమతి

మంగళగిరి: రాజధాని అమరావతి నిర్మాణంలో విద్యుత్ వినియోగానికి ఎయిమ్స్ నుంచి అటవీ శాఖ భూమిని ఉపయోగించుకునేందుకు అనుమతి లభించినట్లు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ ఆవరణలోని అటవీశాఖకు చెందిన భూమిలో విద్యుత్ హై పవర్ లైన్ నిర్మాణానికి అనుమతులు లభించడంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అమరావతికి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

మంగళగిరి: చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుడికి రూ 5.50 లక్షలు చెల్లించాలని మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు మంగళవారం తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన వడిసె సురేష్ వద్ద కొల్లిపర నివాసి తూమాటి పీటర్ 2019లో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2021లో రూ.5.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. దానిని బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయింది. పీటర్‌పై మంగళగిరి కోర్టులో కేసు దాఖలు చేయగా విచారణ కొనసాగింది. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి సదరు నిందితుడు పీటర్‌కు ఏడాది జైలు శిక్ష విధించారు. రూ 5.50 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

అధికారం శాశ్వతం కాదని టీడీపీ గుర్తించాలి

- అడ్డగోలు దాడులపై మాజీ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీ నేతకు నాయకులతో కలిసి పరామర్శ



సాంబిరెడ్డిని పరామర్శిస్తున్న విడదల రజిని, ఏసురత్నం, నూరి ఫాతిమా తదితరులు

పట్నంబజారు: టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. శ్యామలానగర్‌లోని ఆయన నివాసానికి మాజీ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా తదితరులు వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. టీడీపీ నేతల దుశ్చర్యలకు అడ్డూఅదుపు లేకుండా పోతోందని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏ మాత్రం భయపడబోవని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ.. దాడులు, దౌర్జన్యాలు చేయడమే ధ్యేయంగా టీడీపీ పాలన సాగుతోందన్నారు. ఒక నీచ సంస్కృతికి టీడీపీ నేతలు నాంది పలుకుతున్నారని విమర్శించారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి నెలలు గడవకముందే టీడీపీ నేతలు తమ అసలు రంగు బయటపెట్టారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా చూసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మెట్టు వెంకటప్పారెడ్డి, కార్పొరేటర్లు ఆచారి, గురవయ్య, శ్రీనివాసరెడ్డి, రాజలత తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ- కంతేరు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

గుంతలు పూడ్చాక మిక్స్‌డ్ డస్ట్ వేసి రాకపోకలకు ఏర్పాట్లు



గుంతలను బండరాళ్లతో పూడ్చుతున్న దృశ్యం

తాడికొండ: సాక్షి చొరవతో తాడికొండ- కంతేరు రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. వరద దెబ్బకు 10 రోజులుగా ఈ మార్గంలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. విజయవాడ, నాగార్జున యూనివర్సిటీ, మంగళగిరి, పెదకాకాని ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఉద్యోగులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. మంగళవారం 'సాక్షి'లో 'వరదలు తగ్గినా 'దారి'ద్ర్యం తీరలేదు' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్థానిక టీడీపీ నాయకులు స్పందించారు. ఎమ్మెల్యే కనీసం తొంగిచూడని కారణంగా ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే నరకయాతనగా మారిన వైనాన్ని స్పష్టంగా ప్రచురించిన నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. కంతేరు టీడీపీ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య ఆధ్వర్యంలో ఇక్కడి గుంతలలో 6 లారీల బండరాళ్లు వేయించారు. దానిపై రెండు లారీల మిక్స్‌డ్ డస్ట్‌ను వేసి తాత్కాలికంగా ప్రయాణాలకు మార్గం సుగమనం చేశారు. ఆర్ అండ్ బీ అధికారులు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పది రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు దీంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎర్రవాగు వద్ద ఏటా వరద తాకిడికి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్న నేపథ్యంలో వంతెన నిర్మాణం చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రయాణికుల కష్టాలను గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' చొరవను పలువురు అభినందించారు.

నాడు కుయ్ కుయ్... నేడు నై నై..!

- కూటమి ప్రభుత్వంలో 108 వాహన సేవల దుస్థితి
- 40 నిమిషాలపాటు పదుల సంఖ్యలో కాల్స్‌కూ స్పందన శూన్యం



రోడ్డు పక్కనే కింద పడి గిలగిలా కొట్టుకుంటున్న కృష్ణమోహన్ రెడ్డి

ప్రత్తిపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాల్ చేసిన నిమిషాల వ్యవధిలోనే కుయ్.. కుయ్‌మంటూ 108 వాహనం ప్రాణాలు కాపాడేందుకు దూసుకొచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు కాల్ చేసినా దిక్కులేకుండా పోయింది. సామాన్యుడి ప్రాణాలకు భరోసా కలిగేలా సకాలంలో వైద్య సేవలు అందడం గగనమైపోతోంది. ఆపత్కాలంలో ప్రజలకు అత్యవసర సేవలందించాల్సిన 108 వాహనం ఆచూకీ లేకుండా పోతోంది. ప్రజలు ఫోన్లు చేసినా స్పందించే నాథులే లేరు. అందుకు దర్పణమే ఇక్కడ కనిపిస్తున్న చిత్రం. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన బాణాల కృష్ణ మోహన్ రెడ్డి మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో గుంటూరు నుంచి ప్రత్తిపాడు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చి కొట్టుకుంటూ కింద పడిపోయారు. అటుగా వెళుతున్న వారు మానవతా దృక్పథంతో ఆగి 108కు ఫోన్ చేశారు. సుమారు 40 నిమిషాలపాటు ఎంత మంది ఎన్నిసార్లు కాల్ చేసినా వాహనం మాత్రం రాలేదు. ఫోన్ లిఫ్ట్ చేసి రకరకాల ప్రశ్నలు, అడిగినవే మళ్లీ అడుగుతూ సిబ్బంది సమయం వృథా చేశారు. వాహనం మాత్రం వస్తే ఒట్టు. అదే సమయంలో అటుగా వెళుతున్న ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఓ మహిళా వైద్యాధికారి కూడా కృష్ణ మోహన్ రెడ్డి పరిస్థితిని చూసి ఆగారు. డాక్టర్ సైతం 108కు ఫోన్ చేసినప్పటికీ సమాధానం రాలేదు. దీంతో స్థానికులు, బంధువులే ఆటోలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించాల్సిన దుస్థితి దాపురించింది.

ఏడుగురికి ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో ఏడుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి, శిక్షణ అనంతరం పోస్టింగ్ కల్పిస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. షేక్ బురాన్ షరీఫ్, బి. జయరాణి, పి.ప్రమీలాదేవి, కేవీ సుబ్బమ్మ, వి.జాలమ్మను గుంటూరు జిల్లాకు, హెచ్.రెహ్మాన్, ఎస్.వెంకటరమణలను బాపట్ల జిల్లా కేటాయించారు.

సీట్ల భర్తీకి ఎన్జీ రంగా వర్సిటీ దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ విభాగాల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావురీ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన గడువును అక్టోబర్ 10వ తేదీ వరకు పొడిగించామని చెప్పారు. దరఖాస్తు చేశాక హార్డ్ కాపీలను వ్యక్తిగతంగాగానీ, పోస్ట్ ద్వారాగానీ అక్టోబర్ 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా చేరేలా పంపాలన్నారు. దరఖాస్తులు 'రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిపాలనా విభాగం, లాం ఫాం, గుంటూరు- 522034' చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

పిడుగురాళ్ల: అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కరాలపాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ సైదా (37) పంటలు సక్రమంగా పండకపోవటంతో అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు సైదాకు ఎకరం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ, మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి, మెట్ట పంటలు వేశాడు. మూడేళ్ల నుంచి సక్రమంగా పంటలు పండకపోవటంతో పెట్టుబడులకు తెచ్చిన అప్పులు, వడ్డీలు కలిపి సుమారు రూ.10 లక్షల అప్పు అయిందని, ఈ క్రమంలో భార్య ఫర్వీన్ పొలానికి వెళ్లటం, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహ్మద్ సైదా ఫ్యాన్‌కి ఉరివేసుకొని మృతి చెందాడు.

వడ్డీ సహా అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలని తీర్పు

చిలకలపూడి (మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీ సహా అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలలు మంగళవారం తీర్పు చెప్పారు. కోడూరుకు చెందిన కె.పోతయ్య గుంటూరుకు చెందిన శ్రీ షిర్డీ సాయి బృందావనం ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ప్లాటును 2017లో రూ. 22.50 లక్షలకు బుక్ చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ. 4.10 లక్షలు చెల్లించారు. 18 నెలలపాటు వాయిదాల పద్ధతిలో మిగతా చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి శ్రీ షిర్డీ సాయి బృందావనం ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వాయిదా సొమ్ము తీసుకోక పోగా.. ప్లాటు రిజిస్ట్రేషన్ కూడా చేయలేదు. దీంతో పోతయ్య నోటీసులు పంపారు. అయినప్పటికీ ఫలితం లేకపోవటంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన అనంతరం కమిషన్ సభ్యులు అగ్రిమెంట్ కాలం పూర్తయిన నాటి నుంచి 9 శాతం వడ్డీ చెల్లించాలని, అడ్వాన్స్ మొత్తం తిరిగి ఇవ్వాలని తీర్పు చెప్పారు. మానసిక వేదనకు గురిచేసినందున రూ. 25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఇద్దరు ఎంపిక

నరసరావుపేట రూరల్: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని ఎన్‌జీవో హోమ్‌లో ఈనెల 8వ తేదీన నిర్వహించిన జిల్లా జట్ల ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన మానస, ఎస్‌కె ఆరీఫ్‌లు ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, ఫాతిమా అభినందించారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

- ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ కొరకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కాలంలో నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చ కామెర్లు, కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వంటివి వస్తాయన్నారు. వ్యాధులు రాకుండా పలు జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ప్రతి ఒక్కరూ కాచి చల్లారిన నీటిని మాత్రమే తాగాలి.
- అప్పుడే వండిన ఆహారాన్ని భుజించాలి.
- తాగునీరు, ఆహారంపై శుభ్రమైన మూతలు ఉంచాలి.
- ఇంట్లో, పరిసరాల్లో దోమలు, ఈగలు లేకుండా చూసుకోవాలి.
- వంట చేయడం, భోజనం చేసే ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి .
- బయట ఆహార పదార్థాలు, ఈగలు వాలినవి, జంక్ ఫుడ్స్ తినరాదు.
- రోజూ స్నానం చేసి ఉతికిన బట్టలను ధరించాలి. కాలకృత్యాలత తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి.
- వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు చల్లటి గాలిలో తిరగొద్దు. వానలో తడవకుండా తగు జాగ్రత్తలు పాటించాలి.
- ఇంటి పరిసరాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంట్లో, పరిసరాల్లో పాత టైర్, టెంకాయ చిప్పలు, వాటర్ బాటిల్స్, రోళ్లు వంటి సామగ్రిలో నీరు నిలువ లేకుండా చూడాలి.
- వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం తలపెట్టిన ఫ్రై డే - డ్రై డే కార్యక్రమంలో భాగస్వాములు కావాలి.
- దోమలు ఇంట్లోకి రాకుండా ప్రతి రోజు సాయంత్రం తలుపులను, కిటికీలను మూసివేయాలి .
- దోమల నుంచి రక్షణకు వేపాకు పొగ వేయాలి. దోమ తెరలు ఉపయోగించాలి.
- పగటి పూట డెంగీ దోమ నుంచి రక్షణ కోసం శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులను ధరించాలి.
- జ్వరపీడితులు, వాంతులు, విరేచనాలతో బాధపడేవారు స్థానికంగా ఉన్న ఆశా వర్కరు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించి తగిన వైద్య సహాయం పొందాలి.
- ఆరోగ్య సమస్యలున్న వారు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందవచ్చు.

రైళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు



నిందితుడు, చోరీ సొత్తుతో పోలీసులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైల్వే ప్రయాణికుల బ్యాగులు చోరీ చేసిన నిందితుడిని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పదో నంబర్ ప్లాట్‌ఫాం ఉత్తరం వైపు గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామానికి చెందిన మూల్పూరి ఫణీందర్‌రెడ్డి అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగును సోదా చేయగా ల్యాప్‌టాప్, ఐఫోన్, ట్యాబ్ కనిపించాయి. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు. వాటిని ప్రయాణికుల నుంచి చోరీ చేసినట్లు ఫణీందర్‌రెడ్డి అంగీకరించాడు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

168 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



తిమ్మాపురంలో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

నాదెండ్ల: యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో తహసీల్దార్ విజయశ్రీ, డీటీ శ్యామలత, వీఆర్వోలు రాయుడు మిల్లును తనిఖీ చేశారు. అదే సమయంలో లారీలో లోడ్ చేస్తున్న 132 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 36 క్వింటాళ్ల నూకలను గుర్తించారు. సొలస గ్రామానికి చెందిన కిలారు వీరాంజనేయప్రసాద్ తిమ్మాపురంలో ఓ మిల్లును లీజుకు తీసుకుని రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టించి నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం లారీలో రేషన్ బియ్యం బస్తాలపై నూకల బస్తాలు ఉంచి తరలించేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ నేతల మధ్య నెలకొన్న విబేధాలతో మంగళవారం ఓ నేత అనుచరుడి మిల్లులో అక్రమంగా ఉంచిన రేషన్ బియ్యం గురించిన సమాచారాన్ని మరో నేత అనుచరులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. దీంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

ఆగని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన

రెగ్యులర్ చేయాలని డిమాండ్



నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు



జీవో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట జీఓ నెంబర్ 115 కాపీలను దహనం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. మానవహారంలా ఏర్పడ్డారు. జీఓ విడుదల చేసిన నాటి నుంచి జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్నారు. ఆ జీఓను ఉపసంహరించుకుని, తమను రెగ్యులర్ చేసేవరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. అవసరమైతే అత్యవసర వైద్యసేవలు మినహా మిగతావన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, రేణుక, శివమ్మ, స్వరూప, సౌజన్య, వాసు, హైమావతి, రమాదేవి, సురేష్, విజయ్, నూరి, కుసుమ, కోటేశ్వరి పాల్గొన్నారు.

బ్రహ్మంగారి దేవాలయంలో చోరీ

పెదకూరపాడు: బ్రహ్మంగారి దేవాలయంలో హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన పెదకూరపాడులోని కాలచక్ర రహదారిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దేవాలయం ముఖ ద్వారం గేటు తాళాలు గడ్డపారతో పగులగొట్టి దేవాలయంలోకి ప్రవేశించి, దేవాలయంలో గర్భగుడి పక్కన ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదు దోచుకెళ్లారు. గత సంవత్సరం నుంచి హుండీని తెరవలేదని నిర్వాహకులు తెలిపారు. దేవాలయం పూజారి తాళ్లూరి మల్లికార్జునరావు రోజు మాదిరిగానే మంగళవారం తెల్లవారుజామున పూజలు నిర్వహించేందుకు దేవాలయానికి రాగా, ముఖద్వారం తాళాలు, హుండీ పగులగొట్టి ఉండటం గమనించి దేవాలయం కమిటీ నిర్వాహకులకు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని హుండీని పరిశీలించారు.

క్షమాపణ చెప్పించి వదిలేశారు

- బలహీన వర్గాల వ్యక్తితో దౌర్జన్యంగా వ్యవహరించిన టీడీపీ నాయకుడు
- నాలుగేళ్లు మౌనంగా ఉండకుంటే కేసులు పెట్టి బయటకు రాకుండా చేస్తామని బెదిరించిన ఎస్ఐ

కొల్లూరు: కృష్ణా పరివాహక ప్రాంత ప్రజలు వరద ముంపు కారణంగా పడుతున్న బాధలు చాలవన్నట్లు టీడీపీ నాయకుల కుటిల రాజకీయాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కృష్ణనగర్‌కు చెందిన బాధితుడు అర్జునరావు కథనం మేరకు... మండలంలోని తోకలవారిపాలెం శివారు కృష్ణనగర్‌కు చెందిన కుక్కల అర్జునరావు తమ గ్రామం వద్ద పంట పొలాలలో నీరు మళ్లించడానికి టీడీపీ నాయకులు చేసిన యత్నాన్ని ప్రశ్నించడంతో పోలీసులు బలవంతంగా స్టేషన్‌కు తరలించిన విషయం విధితమే. ఎస్ఐ ఏడుకొండలు అర్జునరావును వ్యక్తిగత పూచీకత్తుపై పంపించి మళ్లీ స్టేషన్‌కు రావాలంటూ ఒత్తిడి చేశాడు. దీంతో అర్జునరావు తన గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులతోపాటు, లాయర్‌ను తీసుకుని సోమవారం రాత్రి స్టేషన్‌కు వెళ్లాడు. అప్పటికే టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ స్టేషన్‌లో ఉన్నాడు. కృష్ణనగర్ వాసులు, లాయరు మైనేనితో మాట్లాడి తమ గ్రామం వద్ద రహదారికి గండి పెట్టి నీరు మళ్లిస్తే తమ పొలాలతోపాటు, గ్రామానికి ముప్పు వాటిల్లుతుందన్న భయంతోనే మేము గండి పెట్టకుండా అడ్డుకున్నామని ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని తెలిపారు. అనంతరం బాధితుడు అర్జునరావును పిలిచి క్షమాపణ చెపితే కేసు లేకుండా వదిలేస్తామని ఒత్తిడి చేశారు. తాము తలుచుకుంటే బయటకు రాకుండా కేసులు పెట్టి లోపల వేస్తామని బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అర్జునరావు క్షమాపణ వేడుకున్నాడు. అనంతరం ఎస్ఐ ఈ నాలుగేళ్లలో ఏవిషయం మీదైనా నోరెత్తి ప్రశ్నించినా, ఇటువంటి సంఘటనల్లో ఉన్నట్లు తెలిసినా బయటకు రానివిధంగా కేసులు నమోదు చేసి లోపలకు పంపిస్తామని, తాను ఉన్నంతవరకు ఎక్కడా కనిపించరాదని హెచ్చరించి, గ్రామస్తుల పూచీకత్తుతో విడిచిపెట్టాడు. టీడీపీ నేతలు గ్రామాలలో రాకపోకలకు వినియోగించే ఆర్‌అండ్‌బీ రోడ్లకు గండ్లు కొట్టి మరో మూడు గ్రామాలకు ముప్పు వాటిల్లేలా వ్యవహరించడమే కాకుండా, ప్రజలపై వేధింపులకు దిగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వారికి పోలీసులు అండగా నిలవడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

- జరిగిన ఘటనపై ఎస్ఐ జి.ఏడుకొండలు వివరణ కోరగా, తాను బలవంతంగా క్షమాపణలు చెప్పించినట్లు వస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. ఆ గ్రామానికి చెందిన పెద్దలు, ఓ లాయరు స్టేషన్‌కు వచ్చారని, వారందరూ బయట మాట్లాడుకొని నావద్దకు వచ్చి ఇకపై ఎటువంటి గొడవలకు వెళ్లనని అర్జునరావు చెప్పడంతో బైండోవర్ చేసుకొని పంపించానన్నారు.